epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:33

24 క్యారెట్లు 152,840.00 | కిలో వెండి 2,50,000.00 | chourastha Digitals | 18.09.2026 శుక్రవారం, హైదరాబాద్

## పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటర్ షెడ్యూల్ విడుదల

- నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- డిసెంబర్ 30 న తుది ఓటర్ల జాబితా
- ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం



2లో



## స్టేషన్ బెయిల్ కోసం రూ.10లక్షల లంచం

- కీసర సీఐ ఆంజనేయులు,ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి అరెస్ట్,
- బాణాసంచా కాల్చి స్థానికులు సంబరాలు
- ఇద్దరి ఇళ్లలో ఏసీబీ సోదాలు
- పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోదాలు చేయడం కలకలం సృష్టించింది. కీసర సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఓ కేసు విషయంలో నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు సీఐ ఏకంగా రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నిందితుడితో రకరకాల పనులు చేయించుకున్నారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** కొన్ని రోజులు బిర్యానీలు, కూల్ డ్రింక్స్ తీసుకురావాలంటూ స్థాయి మరచి అధికారిన్ని దుర్వినియోగ పరచి వేధింపులకు గురి చేశారు. ఆ వేధింపులు తట్టుకోలేకపోయిన బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మరోవైపు లంచంగా డిమాండ్ చేసిన డబ్బు తీసుకునే ।మిగతా 2 లో।



## కేసీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు


# మేం సిద్ధం

రేవంత్‌రెడ్డి తన ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా...?

ముఖ్యమంత్రికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించాలి
అసత్యాలతో అసెంబ్లీ పవిత్రతను దెబ్బతీస్తున్న సీఎం
మాపై సస్పెన్షన్ ఎత్తేసి నెలరోజులు సభ జరపాలి
కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ముమ్మాటికీ బోగస్
ముఖ్యమంత్రి పదవికే రేవంత్‌రెడ్డి కళంకం
30 శాతం కమీషన్ల కోసమే 22ఏ
జాతీయ సమైక్యతా దినోత్సవంలో
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పుట్టిన నాటి నుంచి నేటి వరకు, సీఎం రేవంత్ రెడ్డి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇరు కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాము సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించి వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 – జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగరవేశారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందనీ, కేసీఆర్‌పై రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసే సిట్‌లు, సెట్‌లు కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమ వైపు ఏ తప్పైనా బయటపడితే చట్టపరంగా ఎలాంటి శిక్షకైనా తాము సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ముమ్మాటికీ బోగస్ అని వెయ్యిరోజుల విఫల పాలన చూశాక తేలిపోయిందని కేటీఆర్ విమర్శించారు. వాటిపై నిలదీస్తామన్న భయంతోనే బీఆర్ఎస్‌ను సభ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. సభలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా బీజేపీతో రేవంత్ రెడ్డి కుమ్మక్కై అసెంబ్లీని ఏకపక్షంగా ।మిగతా 2 లో।



## అమెరికాలో హైదరాబాద్ యువకుడి మృతి

- అతడి మృతిపై పలు అనుమానాలు
- గతనెల ఆగస్టులో టెక్సాస్‌లోనే వివాహం
- కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు
- మృతదేహాన్ని భారత్‌కు రప్పించే విధంగా చర్యలు చేపట్టాలి
- అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్ అధికారులకు
- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ లేఖ

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** అమెరికాలో హైదరాబాద్ యువకుడు అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. యువకుడి మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్ అధికారులకు ।మిగతా 2 లో।



## ఫ్యూచర్‌సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దుతాం

- హైదరాబాద్‌లో హార్వర్డ్ కోర్సులు
- డిసెంబర్ నుంచి ప్రారంభం
- సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన
- సీఎంతో యూకే బిజినెస్ స్కూల్ బృందం భేటీ
- రాష్ట్రంలో యూకే వర్సిటీల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం
- ఫ్యూచర్‌సిటీ, స్కిల్స్ వర్సిటీ గురించి యూకే బృందానికి అధికారులు వివరణ
- యూకే బృందానికి గ్లోబల్ సమ్మిట్‌కు సీఎంకు ఆహ్వానం

2లో






## పోలీసు ఉద్యోగాలకు పరీక్ష తేదీలు విడుదల

- ఎస్ఐ అభ్యర్థులకు నవంబర్ 29న
  కానిస్టేబుల్ అభ్యర్థులకు డిసెంబర్ 20న రాతపరీక్ష
- పలు విభాగాల్లో 7,437పోస్టులకు నోటిఫికేషన్లు
- 1,46,220 మంది మహిళలు దరఖాస్తు
- వయో పరిమితి మరో మూడేళ్లు పెంపు

2లో

## యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య

- నిజామాబాద్ నగరంలో నడిరోడ్డుపై హత్య
- పాత కక్షల నేపథ్యంలోనే హత్య
- మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలింపు
- నిందితుడు 9 సార్లు కత్తితో నరకారు
- ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్
- హత్య నేనే చేశా.. వైష్ణవి సోదరుడు సంతోశ్ సెల్ఫీ వీడియో
- ఈ మేరకు సంతోశ్ కోరుట్ల పోలీసులకు లొంగుబాటు
- గతంలో వైష్ణవి గొంతు నులిమి చంపినట్లు హరిబాబుపై ఆరోపణలు



2లో



## భూ రికార్డుల విధ్వంసంపై విచారణ జరిపించాలి

- అసైన్డ్ భూములకు రక్షణ కల్పించడంలో గత ప్రభుత్వం విఫలం
- రెవెన్యూ వ్యవస్థపై సీఎం వ్యాఖ్యలు చారిత్రాత్మకం
- ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకువాలి
- రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి

2లో



# యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య



**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
నిజామాబాద్‌లో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నగరంలోని రాజరాజేంద్ర జంక్షన్ వద్ద యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబుని దుండగులు కొబ్బరిబోండాల కత్తితో నరికి విచక్షణారహితంగా హత్యకు పాల్పడ్డారు. ముగ్గురు వ్యక్తులు ఈ దాడిలో పాల్గొన్నట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పాత కక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లుగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హరిబాబు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం పోలీసులు జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

హరిబాబు అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా తన తల్లితో కలిసి నిజామాబాద్ ఐదో పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రాపూర్‌లో నివసిస్తున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో వారు మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలానే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో దాహం వేస్తుందని, నీళ్ల కోసం పక్కనే ఉన్న ఓ చాట్ బండి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలోనే ఓ కారులో గుర్తుతెలియని దుండగులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో దాడికి పాల్పడ్డారు. తీవ్రగాయాలపాలైన హరిబాబు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కారులో 3 వ్యక్తులు ఉండగా ఓ వ్యక్తి వచ్చి పదునైన ఆయుధంతో తలపై దాడి చేసిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. నిందితుడు 9 సార్లు కత్తితో నరికిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.జగిత్యాల జిల్లాలోని కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవికి చిత్తరి హరిబాబు(26) అనే వ్యక్తితో పెళ్లి జరిగింది. గతంలో హరిబాబు, వైష్ణవి గొంతు నులిమి, చేతులు, నుదిటిపై కత్తితో దాడికి పాల్పడి చంపినట్లుగా ఆరోపణలున్నాయి. ఆమె అప్పుడు నాలుగు నెలల గర్భిణి. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి హరిబాబును అరెస్టు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చిన అతడు ఇవాళ దారుణహత్యకు గురయ్యాడు. యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హరిబాబును తానే చంపానని వైష్ణవి సోదరుడు సంతోశ్ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. తన చెల్లిని చంపినందుకు ప్రతీకారంగా హరిబాబును చంపినట్లు వెల్లడించాడు. ఈ మేరకు సంతోశ్ కోరుట్ల పోలీసులకు లొంగిపోయాడు.



# రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు
- హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**
హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రాత్మక రోజైన సెప్టెంబరు 17ను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖామాత్యులు, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.అంతకుముందు ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన సాయుధ పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు.ఈ వేడుకల్లో భాగంగా పలువురు అమరవీరుల కుటుంబ సభ్యులను మంత్రి ప్రత్యేకంగా సన్మానించారు.ఈ వేడుకల్లో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి,షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్‌లతో పాటు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో

# విచారణకు మేం సిద్ధం

**తరువాయి భాగం**
నడిపించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కళ్లల్లో కళ్లు పెట్టి చూసే ధైర్యం ప్రతిపక్షానికి లేదన్న రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. ధైర్యముంటే శాసనసభ సమావేశాలను నెల రోజులపాటు పొడిగించి, మాపై సస్పెన్షన్లను ఎత్తేయండి. కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం కాదు, 420 హామీల మోసంపై ప్రజల పక్షాన కాలర్ పట్టుకుని నిలదీస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ. నాలుగు వేల పింఛన్లు, రైతులకు కరెంట్, సాగునీరు, రైతుబంధు, అర్ధాంతరంగా రద్దు చేసిన రైతుబీమాపై సభాముఖంగా నిలదీస్తామని చెప్పారు.
చట్టసభల్లో అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు హుందాగా, పెద్దరికంతో మాట్లాడాలే తప్ప అసత్యాలు, అర్ధసత్యాలతో ప్రజలను, రాష్ట్రాన్ని, శాసనసభను తప్పుదోవ పట్టించడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ పవిత్రతను దుర్వినియోగం చేశారనీ, ముఖ్యమంత్రి పదవికే తీవ్ర కళంకం తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూసి అతను కూడా నాలుగు పద్యాలు, కొటేషన్లు, పెద్దల పేర్లు చెప్తే గొప్ప నాయకుడిని అయిపోతానని శ్రీశ్రీ పేరును రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని గుర్తు చేశారు. ఆ మహానుభావుడి పూర్తి పేరు కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ఎద్దేవా చేశారు.

**30 శాతం కమీషన్ల కోసమే 22ఏ**
30 శాతం కమీషన్లు దండుకోవడానికే ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితా తీసుకొచ్చిందని కేటీఆర్ విమర్శించారు. కోటి ఎకరాల నిషేధిత భూముల్లో 30 లక్షల ఎకరాల ప్రయివేట్ భూములున్నాయంటూ సీఎం ఒప్పుకున్నారని వివరించారు. తప్పు ప్రభుత్వం చేసి సామాన్య ప్రజలను నిరూపించుకోమనడం వెనుక భారీ వసూళ్ల దందా దాగి ఉందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంటిని 22ఏలో పెడితే రాత్రికి రాత్రే నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్న ముఖ్యమంత్రి, సాధారణ ప్రజల భూములను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. భూ కుంభకోణాలను కప్పిపుచ్చుకోవడానికే 'ధరణి'ని రద్దు చేసి 'భూభారతి' తెచ్చారని ఆరోపించారు.తాజా వార్తలు చదవండి

**ఫామ్‌హౌస్‌పై తప్పుడు ప్రచారం**
వెయ్యి సార్లు 1000 ఎకరాల ఫామ్‌హౌస్ అని రేవంత్ రెడ్డి గతంలో అన్నారనీ, అసెంబ్లీలో 67 ఎకరాలని స్వయంగా అంగీకరించారని కేటీఆర్ చెప్పారు. మిగిలిన 933 ఎకరాలు ఎక్కడున్నాయో చూపిస్తే వాటిని ప్రభుత్వానికే రాసిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్లలోనే ఈ భూముల వివరాలను వెల్లడించారనీ, ఆదాయపు పన్ను, స్టాంప్ డ్యూటీ చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవసాయ భూమి అని వివరించారు. ఇంతకాలం వాటిపై తప్పుడు ప్రచారం చేసి బురదజల్లినందుకు కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




## స్టేషన్ బెయిల్ కోసం

# రూ.10లక్షల లంచం

బాధ్యతను సీఐ ఎస్సైకి అప్పగించారు. ఈ సమాచారంతో ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు.
కీసర చెరువుగట్టు వద్ద గణేశుల నిమజ్జనం విధుల్లో ఉన్న ఎస్సై రూ.5 లక్షల లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి రావడం చూసిన ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి అక్కడి నుంచి వేగంగా పరుగులు పెట్టాడు. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ఏసీబీ అధికారులను ముప్పుతిప్పలు పెట్టాడు. అనంతరం పూర్తి వివరాలు తెలుసుకున్న అధికారులు ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి, సీఐ ఆంజనేయులును అరెస్టు చేశారు.

**సీఐ, ఎస్సై ఇళ్లలోనూ సోదాలు**
ఏసీబీకి పట్టుబడిన కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి ఇళ్లలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. సీఐ ఆంజనేయులు ఇంట్లో రూ.5 లక్షలు, ఎస్సై జ్ఞానేందర్ ఇంట్లో రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలనూ స్వాధీనం చేసుకున్నారు. పలు కేసుల విషయంలో లంచాల పేరుతో తీవ్రంగా వేధించేవారంటూ కీసర, బోగారం ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీబీ ట్రాప్‌పై స్పందించిన కొందరు స్థానికులు కీసర పోలీస్ స్టేషన్ ఎదుట బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పలు కేసుల విషయంలో లంచం డబ్బులు డిమాండ్ చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తున్నారు. తాజాగా ఈ ఇద్దరు పోలీస్ అధికారులు ఏసీబీకి పట్టుబడటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటర్ షెడ్యూల్ విడుదల

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ విడుదలైంది. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు హైదరాబాద్‌రంగారెడ్డి, వరంగల్‌ఖమ్మం ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితా షెడ్యూల్‌పై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవి కాలం మార్చి 2027 నాటికి ముగియనుందని తెలిపారు. 2026 నవంబర్ 1ని ఓటరు నమోదుకు అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఈ నెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుందనీ, నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుందని తెలిపారు. డిసెంబర్ 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నామని తెలిపారు. గతంలో ఓటున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫారం18తో పాటు ధ్రువీకరించిన విద్యార్హత పత్రాలు సమర్పించాలన్నారు.
ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌లో అవకాశం ఉందని చెప్పారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, డిజిగ్నేటెడ్ అధికారుల వద్ద ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పోస్టు ద్వారా కూడా ఫారం18 దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు.

**ఓటర్ షెడ్యూల్ వివరాలు...**
1). సెప్టెంబర్ 28న ఓటర్ల నమోదు ప్రక్రియకు నోటిఫికేషన్
2). నవంబర్ 1, 2026 అర్హత తేదీగా ఓటర్ల జాబితా తయారీ
3).నవంబర్ 6 వరకు ఫారం18 దరఖాస్తుల స్వీకరణ
4).నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
5).నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ
6). డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

# అమెరికాలో హైదరాబాద్ యువకుడి మృతి

**తరువాయి భాగం**
ఎంపీ అసదుద్దీన్ లేఖరాశారు.హైదరాబాద్ నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన మహమ్మద్ జాబేర్ హుస్సేన్ అనే యువకుడు మసాచుసెట్స్ రాష్ట్రంలోని లోవెల్ నగరంలో ఈనెల 14న మృతిచెందాడు. ఉన్నత విద్యను పూర్తిచేసుకుని అమెరికాలోనే ఉద్యోగం చేస్తున్న జాబేర్ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.గతనెల ఆగస్టులో టెక్సాస్‌లోనే వివాహం జరగడం, ఆ తర్వాత కొద్దిరోజులకే ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. జాబేర్ హుస్సేన్ చదువులో మంచి ప్రతిభ కనబరిచేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో 2021లో అమెరికా వెళ్లారన్నారు. మాస్టర్స్ డిగ్రీ కోసం అమెరికా వెళ్లిన ఆయన తొలుత కనెక్టికట్లోని విద్యాసంస్థలో చదువును కొనసాగించారని వివరించారు.మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసిన అనంతరం మహమ్మద్ జాబేర్ హుస్సేన్ అమెరికాలో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించారు. అనంతరం మసాచుసెట్స్ రాష్ట్రంలోని లోవెల్ నగరంలో జాబ్‌లో చేరారు. చదువుతో పాటు వృత్తిపరంగా కూడా స్థిరపడేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన జీవితం విషాదాంతమైంది. జీవితంలో ఉన్నత స్థానానికి వెళ్తాడనుకున్న వ్యక్తి దుర్మరణం చెందడంతో అతడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. జాబేర్ హుస్సేన్ ఏ విధంగా మృతిచెందాడనే విషయం ఇంకా తెలియరాలేదు. అతడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**భారత కాన్సుల్ జనరల్‌కు అసదుద్దీన్ లేఖ**
మరోవైపు అమెరికాలోని భారత కాన్సుల్ జనరల్‌కు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ లేఖ రాశారు. మహమ్మద్ జాబేర్ హుస్సేన్ మృతిపై అతడి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని లేఖలో పేర్కొన్నారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని వెంటనే భారత్‌కు తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అసదుద్దీన్ కోరారు. కుమారుడిని కోల్పోయి తీవ్ర ఆందోళనలో ఉన్న ఆ తల్లిదండ్రులకు అండగా నిలవాలని ఆయన కోరారు.

## భూ రికార్డుల విధ్వంసంపై

# విచారణ జరిపించాలి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
ధరణి పేరుతో జరిగిన భూ రికార్డుల విధ్వంసంపై విచారణ జరిపించాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు వెంకన్న యాదవ్, కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో వారు మీడియాతో మాట్లాడారు. నిజాం కాలం నుంచి కొనసాగుతున్న రెవిన్యూ రికార్డుల వ్యవస్థ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు వరకు ఒక పద్ధతి ప్రకారం కొనసాగిందనీ, గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో చేపట్టిన కార్యక్రమం ద్వారా అనేక భూ రికార్డుల్లో గందరగోళం ఏర్పడిందని తెలిపారు. ప్రత్యేకంగా భూదాన్, అసైన్డ్, పట్టా భూముల రికార్డుల విషయంలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. అసైన్డ్ భూములకు రక్షణ కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.



వీఆర్ఓ వ్యవస్థ రద్దు, భూ రికార్డుల డిజిటలైజేషన్‌లో తలెత్తిన సమస్యలు, ధరణి వ్యవస్థలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు భూ హక్కులపై ప్రభావం చూపాయని తెలిపారు. 22 ఏ కింద ఉన్న భూముల విషయంలో అర్హులైన భూ యజమానులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నామన్నారు. భూదాన్, అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




## పోలీసు ఉద్యోగాలకు

# పరీక్ష తేదీలు విడుదల

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్ష తేదీలను తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) విడుదల చేసింది. ఎస్ఐ అభ్యర్థులకు నవంబర్ 29న ప్రాథమిక పరీక్ష, కానిస్టేబుల్ అభ్యర్థులకు డిసెంబర్ 20న రాతపరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్ఎల్‌పీఆర్‌బీ ప్రకటనలో తెలిపిది. ఈ రాత పరీక్షలను తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాల కేంద్రాల్లో నిర్వహించనున్నారు.
పోలీసుశాఖలో జులై 29న హోంశాఖ పరిధిలోని పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో 7,437 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నోటిఫికేషన్లకు సంబంధించి సెప్టెంబర్ 16తో దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. 7,437పోస్టులకు మొత్తం 5,77,064 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది దరఖాస్తు చేసుకున్నారు. పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారిలో 1,46,220 మంది మహిళలు ఉన్నారు. పోలీస్, ఫైర్, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) తదితర శాఖల్లో కానిస్టేబుల్ సమాన స్థాయి పోస్టుల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి గరిష్ఠ వయో పరిమితిని ప్రభుత్వం మరో మూడేళ్లు పెంచింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ బుధవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వం గతంలో వివిధ ఉత్తర్వుల ద్వారా యూనిఫాం సర్వీసుల్లో ప్రత్యక్ష నియామకాలకు గరిష్ఠ వయో పరిమితిని ఏడు సంవత్సరాల పాటు పెంచింది.

# ఫ్యూచర్‌సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దుతాం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
తెలంగాణలో ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, ఫార్చ్యూన్500 కంపెనీలు ఉండేలా అడుగులు వేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ డిసెంబరు నుంచి హైదరాబాద్‌లో ఎగ్జిక్యూటివ్ కోర్సు అందించనుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫ్యూచర్‌సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అవకాశాలపై యూకేలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, బిజినెస్ స్కూళ్ల ప్రతినిధులతో సీఎం చర్చించారు.అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ డిసెంబరు నుంచి హైదరాబాద్‌లో ఎగ్జిక్యూటివ్ కోర్సు అందించనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్‌సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో యూకే యూనివర్సిటీల ప్రతినిధుల బృందంలో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్రంలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు విదేశీ విశ్వవిద్యాలయాలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా యూకే బృందానికి సీఎం తెలిపారు. ఎంఐటీ, వంటి పలు ఐవీ లీగ్ యూనివర్సిటీలు హైదరాబాద్‌లో ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే ప్రక్రియ ఇప్పటికే మొదలైందన్నారు. విదేశీ విద్యాసంస్థలు రాష్ట్రానికి వస్తే స్థానిక యూనివర్సిటీలు, పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి, ఇక్కడే పరిశోధనలు చేపట్టడానికి వీలవుతుందని సీఎం అన్నారు.

**అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు**
యూకే బిజినెస్ స్కూల్స్ తెలంగాణలో ఏర్పాటైతే ప్రపంచ స్థాయి కార్పొరేట్ వ్యాపార సంస్థలు రాష్ట్రం వైపు చూస్తాయన్నారు. రాష్ట్ర విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ అనుభవం, ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. హార్వర్డ్, ఎంఐటి, లండన్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయం వంటి అనేక ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, డ్యూయల్ డిగ్రీ కోర్సులు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన వంటి రంగాల్లో భాగస్వామ్యాలు ప్రారంభించవచ్చన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించేందుకు సుమారు 30వేల ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌సిటీలో ఎడ్యుకేషన్ హబ్ కూడా తీర్చిదిద్దనున్నట్లు యూకే బృందానికి సీఎం వివరించారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు సీఎంకు ఆహ్వానం**
డిసెంబరు జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు యూకే విద్యా వ్యవస్థలో ముఖ్యులందరూ రావాలని సీఎం ఆహ్వానించారు. ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ అగ్రగామి సంస్థలు ముందుకొస్తున్నాయన్న సీఎం టీసీఎస్ 70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటాసెంటర్ నిర్మించనుందని లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటాసెంటర్ నిర్మాణం చేపట్టిందన్నారు. తెలంగాణలో ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, ఫార్చ్యూన్500 కంపెనీలు ఉండేలా అడుగులు వేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, అలాగే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల.. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు బ్రిటన్ బృందానికి తెలిపారు. సమావేశంలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓ ఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది వివిధ యూకే యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు జయేష్ రంజన్, ఎన్. శ్రీధర్, తదితరులు హాజరయ్యారు.

# పుట్టగొడుగుల్లా రైస్ మర్చంట్ షాపులు...

- జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా బియ్యం దందా!
- అనుమతులు లేని దుకాణాలు.. నాణ్యత లేని ప్యాకింగ్‌లు!
- ఒకే రకం బియ్యం.. ఒక్కో చోట ఒక్కో ధర!
- తూకంలో తేడాలు.. అధికారుల సంయుక్త తనిఖీలకు డిమాండ్!
- దుకాణాలు.. పర్యవేక్షణ ఏది?
- రకరకాల ముద్రలు.. రకరకాల ధరలు..
- నాణ్యతపై కొనుగోలుదారుల్లో అనుమానాలు!



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో బియ్యం వ్యాపారులు, ధాన్యం దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రకరకాల పేర్లతో క్రొత్త రకాల బియ్యం విపణిలోకి వస్తుండగా, ఒకే రకం బియ్యానికి కూడా ప్రాంతాలను బట్టి, దుకాణాలను బట్టి వేర్వేరు ధరలు ఉండటం కొనుగోలుదారుల్లో తీవ్ర అయోమయానికి తావిస్తోంది. అసలు ఈ బియ్యం ఎక్కడి నుంచి వస్తోంది? ఏ యంత్రశాలల నుంచి సరఫరా అవుతోంది? విక్రయదారుల వద్ద అవసరమైన ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? నాణ్యతను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్నాయి.

***ఆహార భద్రత అనుమతులు ఉన్నాయా?**

ఆహార పదార్థాల వ్యాపారం నిర్వహించే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆహార భద్రతా రక్షణ శాఖ నుండి నమోదు పత్రం లేదా అనుమతి పత్రం పొందడం తప్పనిసరి. అయితే జిల్లాలో కొనసాగుతున్న ప్రతి బియ్యం దుకాణం, హోల్‌సేల్ వ్యాపారి, పంపిణీదారుల వద్ద ఆయా నిబంధనలకు సంబంధించిన అనుమతులు ఉన్నాయా? వివరాలు సక్రమంగా ఉన్నాయా? అనే అంశంపై ఆహార భద్రతా అధికారులు తక్షణమే తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్యాకింగ్‌పై వివరాలేవి?.. నాణ్యతపై సందేహాలు**

సంతలో 25 కిలోలు, 26 కిలోలు, 30 కిలోల బస్తాలతో అనేక రకాల బియ్యం విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల ఆకర్షణీయమైన పేర్లతో, మరికొన్ని చోట్ల సాధారణ బస్తాలలో విక్రయాలు సాగుతున్నాయి. కానీ, ఆయా బస్తాలపై తయారీదారు, ప్యాకర్, తయారీ సంఖ్య, నికర బరువు, ఆహార భద్రత అనుమతి వివరాలు పక్కాగా ఉంటున్నాయా లేదా అన్నదానిపై సంబంధిత శాఖలు కనీస తనిఖీలు కూడా చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**బియ్యం మూలం ఏమిటి?.. ప్రభుత్వ రేషన్ బియ్యం మళ్లింపు?**

వరి మిల్లుల నుంచి బియ్యం ఎక్కడికి వెళుతోంది? పెద్ద వ్యాపారుల నుంచి ఏ దుకాణాలకు సరఫరా అవుతోంది? సరుకు కొనుగోలుకు సంబంధించి సరైన రసీదులు, బిల్లులు, సరుకు నిల్వ పత్రాలు నిర్వహిస్తున్నారా? అన్న అంశాలు కూడా తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయి. ముఖ్యంగా పేదల కోసం కేటాయించిన ప్రభుత్వ ఉచిత రేషన్ బియ్యం అక్రమంగా మళ్లీ తిరగబోత (రీపాలిషింగ్) జరిగి బహిరంగ విపణిలోకి మళ్లుతోందా? అన్న కోణంలో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.

***తూకంలో మోసాలు.. కొలతల శాఖ నిద్రమత్తు!***

వినియోగదారులకు అందించే బియ్యం బస్తాలపై పేర్కొన్న నికర బరువు వాస్తవంగా ఉందో లేదో ఎవరూ పరిశీలించడం లేదు. బస్తాపై ఉన్న తూకానికి, లోపల ఉన్న బియ్యానికి తేడాలు ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దుకాణాల్లో ఉపయోగిస్తున్న యంత్ర తూకాలు సంబంధిత తూకాలుకొలతల శాఖ నిబంధనల ప్రకారం ముద్ర వేసి ఉన్నాయా? లేదా? అన్నది అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది.

**ధరల వ్యత్యాసం.. అయోమయంలో కొనుగోలుదారులు***

ఒకే తరహా బియ్యానికి రకరకాల దుకాణాల్లో 25కేజీ బ్యాగ్ లకు రూ.100 నుంచి రూ.300 వరకు ధరల తేడాలు కనిపిస్తుండటంతో సామాన్య ప్రజలు ఏది కొనాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. నాణ్యత, రకం, బ్రాండ్, పంట కాలం, నూర్పిడి విధానం వల్ల ధరల్లో తేడాలు ఉండవచ్చని వ్యాపార వర్గాలు చెబుతున్నప్పటికీ, కొనుగోలుదారులను మోసం చేయకుండా విపణి ధరలపై అధికారులు స్పష్టత నివ్వాల్సి ఉంది.

**ఉమ్మడి తనిఖీలకు డిమాండ్!**

జిల్లాలో అనధికారికంగా వెలుస్తున్న బియ్యం దుకాణాలు, గోదాములు, పెద్ద వ్యాపారులపై సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.ఆహార భద్రత శాఖ,పౌర సరఫరాల శాఖ,తూకాలుకొలతల శాఖ ఈ శాఖల అధికారులు సమన్వయంతో కదిలి 'సంయుక్త తనిఖీలు' చేపట్టి సరుకు మూలం, రసీదులు, నాణ్యత, ప్యాకింగ్, తూకాలను పరిశీలించాలని జిల్లా ప్రజలు స్పష్టం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యాపారం చేసే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైస్ మర్చంట్లపై అధికారులు మెరుపు దాడులు చేయాలని తెలంగాణ చౌరస్తా దినపత్రికతో పేదవాడి నోటికాడే బియ్యాన్ని కూడా లాకెళ్తున్నారని ఆరోపణలు తో రైస్ మర్చంట్లపై *తెలంగాణ చౌరస్తా* వరుస కథనాలు..



## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

- బీజేపీ అర్బన్ మండల అధ్యక్షుడు ఫైండ్ల రాజేష్

**తొర్రూర్-తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ అర్బన్ మండల అధ్యక్షుడు ఫైండ్ల రాజేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ విమోచన కోసం పోరాడిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం చారిత్రాత్మకమైనదని పేర్కొన్నారు. ప్రజల స్వేచ్ఛ, హక్కులు మరియు ప్రజాస్వామ్య విలువల కోసం ఎంతోమంది త్యాగాలు చేశారని గుర్తుచేశారు.తెలంగాణ విమోచన పోరాట చరిత్రను నేటి యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు అన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ,ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలుపుల శంకర్ జిల్లా నాయకులు అలిసేరి రవిబాబు,మంగళపల్లి యాకన్న,గడ్డల శేఖర్, సిహెచ్ విజయ్ కుమార్, చల్వాయి సత్యనారాయణ,మండల ప్రధాన కార్యదర్శి నడిగడ్డ సందీప్,గట్ల భరత్,నరకుట్టి చలపతి రాజు, జలగం రవీందర్,సర్పి వెంకటేష్,గంధం రాజు, ధరావత్ తేజస్, కాగు నవీన్, నూకల నవీన్, కొండపల్లి శ్రీనివాస్, తూర్పాటి మోహిత్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా

- మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ రెడ్డి
- కమాన్‌పూర్ ఎంపీడీవో ఆఫీస్‌లో మండల స్థాయి సమీక్షా సమావేశం

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ మండలంలోని పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీవో సాదినేని ప్రియాంక అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశం జరిగింది.ఈ సమావేశంలో సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, శీలారపు మల్లయ్య, బొంగోని సదయ్య, జంగిలి పోచాలు, గుమ్మడి శ్రీనివాస్, పల్లె మాధవి నారాయణ పాల్గొని తమ గ్రామాల సమస్యలను లేవనెత్తారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు మాట్లాడుతూ.. గ్రామాల సమస్యలను మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాసంతి, వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ, విద్యుత్ ఏఈ స్వామి, పశువైద్యాధికారి మురళీకృష్ణ, ఎక్సైజ్ ఎస్సై నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐలకు ఘన వీడ్కోలు

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

పోలీసు అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ సూచించారు. సీఐ ఆధ్యర్యంలో గురువారం నాగోల్ పోలీస్ స్టేషన్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించి ఇటీవల బదిలీ అయిన ఎస్ఐలు పి.శివనాగ ప్రసాద్,బి. రమేష్‌లకు స్టేషన్ సిబ్బంది,ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా సీఐ మక్బూల్ జానీ మాట్లాడుతూ..పోలీసు విధుల్లో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నాగోల్‌లో సుమారు రెండేళ్ల పాటు పనిచేసిన శివనాగ ప్రసాద్, రమేష్‌లు నిబద్ధతతో వ్యవహరించారని,కేసుల దర్యాప్తులోనూ,ప్రజా భద్రతలోనూ కీలక పాత్ర పోషించారని అభినందించారు. కొత్త బాధ్యతల్లోనూ సమర్థవంతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.అనంతరం ఎస్ఐలు పి.శివనాగ ప్రసాద్,బి.రమేష్ మాట్లాడుతూ..తమ పదవీ కాలంలో సహకరించిన పోలీస్ సిబ్బందికి,స్థానిక ప్రజలకు,వివిధ రాజకీయ పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.అందరి సమన్వయంతోనే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బదిలీ అయిన ఎస్ఐలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చెరుకు చిరంజీవి గౌడ్,బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నాయకులు అనంతుల జంగా రెడ్డి,సతీష్ యాదవ్,చింతల సురేంద్ర యాదవ్,చెరుకు ప్రవీణ్ కుమార్,స్థానిక నాయకులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా నరేంద్ర మోడీ బర్త్ డే వేడుకలు

- బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి

**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా :**

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా రామన్నపేట సుభాష్ సెంటర్లో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగిరేయడం జరిగింది అలాగే భారతదేశ చరిత్రను నలుమూలల వ్యాపింపజేస్తూ భారతదేశాన్ని విశ్వ గురువుగా చేయడం లక్ష్యంగా పెట్టుకొని భారతదేశాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తూ అవినీతి రహిత పాలనని అందిస్తున్న మన ప్రియతమ ప్రధానమంత్రి మన్యశ్రీ నరేంద్ర మోడీ గారి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట యాదయ్య బిజెపి సీనియర్ నాయకులు దోగుపర్తి సుభాష్ జెల్లా లక్ష్మీనారాయణ మన్యం పద్మా రెడ్డి రాపోలు స్వామి శనగొండ భుక్షమాచారి భాస్కర చారి సురవి హరిబాబు జనరల్ సెక్రటరీ జంగిలి సత్యనారాయణ బెజ్జంకి శివకుమార్ చారి ఉపాధ్యక్షులు కంభంపాటి శివరంజన్ బట్టి రమేష్ కార్యదర్శులు గన్నెబోయిన మధు బతుక నరేష్ రేపాక లింగస్వామి ఏనూతుల సురేష్ మచ్చ మహేష్ బతుక సైదులు తిరుమలేష్ పెండెం శ్రీను ఘాట్కా శ్రీను భువనగిరి వెంకటేష్ పోతుగని ప్రకాష్ కైరంకొండ సంతోష్ సురివి శేఖర్ బండమీది సుధాకర్ గురుకు సైదులు గాదె మల్లయ్య గాద సైదులు ఎర్రబోయిన వెంకటేష్ శివ తదితరులు పాల్గొన్నారు




## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా:**

రామన్నపేట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు,గ్రామ పంచాయతీల వద్ద తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాలు రెపరెపలాడాయి.గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ లాల్‌బహదూర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో రాములు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద ఏపీవో వెంకన్న, మహిళా సంఘం భవనం వద్ద మహిళా సంఘం అధ్యక్షురాలు ఆకుల మౌనిక, సర్కిల్ పోలీస్ కార్యాలయం వద్ద సీఐ మెలుగు రవి, ఎస్ఐ కార్యాలయం వద్ద ఎస్ఐ గోపాతి సతీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిసి జాతీయ గీతం 'జనగణమన' ఆలపించారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా కార్యాలయాల్లో దేశభక్తి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటేలా కార్యక్రమాలు నిర్వహించారు.


## ఇంటి ఇంటికి భజన,ప్రతి గుడిలో భజన

- తుప్పత్ ఆనంద్ నివాసంలో ఘనంగా వినాయక భజన
- వినాయక మండపాల వద్ద భక్తి గీతాల ఆలాపన, భజనలు చేయాలి
- బిజెపి నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి తదితరులు



**మేడిపల్లి,తెలంగాణ చౌరస్తా:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కాలనీలో నారద మహతి భజన మండలి సత్సంగం గురూజీ భవాని శంకర్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు తుప్పత్ ఆనంద్ ఉమా దేవి నివాసంలోనే శ్రీ గణపతి మండపం వద్ద వినాయక భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ భజన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, బోడుప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షులు తలారి రవి, జిఎస్ బానుకుంటా వేణు, పీర్జాదిగూడ బిజెపి డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ , యువ మోర్చా నాయకులు, గోమాత రక్షకులు బండారి పవన్ , బోడుప్పల్ నగర్ కార్యవాహ రాంరెడ్డి , భాగ్యనగర్ గణేష్ ఉత్సవసమితి బోడుప్పల్ కన్వీనర్, కో కన్వీనర్ సభ్యులు ఉప్పరి విజయ్, పద్మ, ప్రగతి , సత్యం ,అరుణ్ , జిల్లా ఎండోమెంట్ సెల్ కన్వీనర్ కరుణాకర్, బోడుప్పల్ వీరశైవ లింగాయత్ బసవ మండపం అధ్యక్షులు నాగేందర్ పాటిల్, విజయ్ కుమార్, జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ దాసరి మహేష్ , వివిధ కాలనీల మిత్రులు, మహిళలు యువకులు ఎంతో భక్తి శ్రద్ధలతో భజన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురూజీ భవాని శంకర్ మాట్లాడుతూ మనం ప్రతి ఒక్కరం మట్టి గణపతిని పూజించాలని, పూజలో కూడా ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదని సహజంగా దొరికే పూలు గరిక ఆకులతో పూజ పూజ కార్యక్రమాలు నిర్వహించాలని భక్తులకు పిలుపునిచ్చారు. అనంతరం తుప్పత్ ఆనంద్ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద సినిమా పాటలు, వేయకుండా, భక్తి పాటలతో పాటు, భజన, మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.



## మత్తుకు బానిసైతే భవిష్యత్తు శూన్యం

- అనాజ్ పూర్ సర్పంచ్ రాచపాక నవనీత మహేష్
- గ్రామపంచాయతీ కార్యాలయంలో
- డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**

యువత దురలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని..మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని అనాజ్ పూర్ గ్రామ సర్పంచ్ రాచపాక నవనీత మహేష్ పిలుపునిచ్చారు.గురువారం అనాజ్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో యువతను ఉద్దేశించి డ్రగ్స్ రహిత సమాజం మన బాధ్యత అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ నవనీత మహేష్ మాట్లాడుతూ..నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత సరదాగా ప్రారంభించే అలవాట్లతో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడి తమ అమూల్యమైన జీవితాలను పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాలు క్షీణించడమే కాకుండా, కుటుంబాలు తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందుల్లో కూరుకుపోతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ సిఐ అశోక్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సూరిబాబు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి ప్రజా పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గాండ్ల మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజాకారుల పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకోవాలని. సీఎం రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించడంతో అమరుల ఆత్మలకు శాంతి చేకూరిందని, మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని అన్నారు. అనంతరం ఇటీవల రెండోసారి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికైన ఎస్.ఎస్. అన్వర్‌ను జిల్లా కార్యదర్శి గాండ్ల మోహన్, నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇనగంటి రామారావు, గడప కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమానికి.. సాయుధ పోరాటమే స్ఫూర్తి..

- తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో..
- అనే నినాదంతోనే స్వరాష్ట్రం సాకారం
- మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్
- దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధు
- తెలంగాణ భవన్ లో ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం



**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితోనే ఉద్యమ నేత కేసీఆర్ తెలంగాణ కోసం ఉద్యమించి స్వరాష్ట్రాన్ని సాధించారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధు పేర్కొన్నారు. కేసీఆర్ కృషి, దీక్ష, పట్టుదల, తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో.. అనే నినాదంతో తెలంగాణ స్వరాష్ట్ర కల సహకారమైందని గుర్తు చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో కలిసి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతోమంది త్యాగధనుల పోరాటం ఫలితంగానే తెలంగాణ (హైదరాబాద్ స్టేట్) భారతదేశంలో విలీనమైందన్నారు. పార్టీ కోసమో, కులం, మతం కోసమో కాకుండా చైతన్యవంతమైన ఉద్యమంలో పోరాటాలు సాధించిన విజయంగా సెప్టెంబర్ 17న ప్రత్యేక దినంగా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయ్యాక, రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాల అమలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపినట్లు చెప్పారు. ప్రతి గడపగడపకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు చేకూర్చి, ప్రతి ఎకరాకు సాగు నీరు అందించి భారతదేశంలోనే గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్ దేనని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు స్వేచ్ఛ, యువతకు ఉద్యోగాలు లేక , రైతులకు కరెంటు గోసలు, త్రాగు, సాగునీరు, ఎరువులు తదితర సమస్యలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

**అమరుల త్యాగాల వల్లే తెలంగాణ : మాజీ ఎమ్మెల్యే దాసరి**

అమరుల త్యాగాల ఫలితంగానే స్వరాష్ట్ర ఆకాంక్ష నేరవేరిందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ ఎందరో త్యాగధనులు పోరాటం చేసినందునే, ఈరోజు మనం ఆ ఫలాలు అనుభవిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# తెలంగాణ చౌరస్తా కథనానికి స్పందన

- ఎట్టకేలకు స్పందించిన విద్యుత్ అధికారులు
- వంగిన కరెంట్ పోల్ లో స్థానంలో మరో కొత్త పోల్
- ఆనందం వ్యక్తం చేసిన రైతన్నలు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని నుంచి కాల్వ శ్రీరాంపూర్ నుంచి పోత్కపల్లి వెళ్లే దారిలో కెనాల్ కాల్వ వద్ద 11 కే విద్యుత్ సరఫరా జరుగుతున్న విద్యుత్ స్తంభం దాదాపు ఆరు నెలల నుంచి రోడ్డు విస్తరణలో భాగంగా వంగి ఉంది. అటువైపు నిత్యం ప్రజలు ప్రజాప్రతినిధులు వెళుతూనే ఉంటున్నా కనీసం అటువైపు చూస్తున్న నాదుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా,సంబంధిత జిల్లా విద్యుత్ శాఖ అధికారులు,ఆర్ అండ్ బి రోడ్డు అధికారులు,రోడ్


ప్రమాదకరంగా వంగిన 'కరెంట్ పోల్'

- గత ఆరు నెలలుగా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు
- వంగిన పోల్ మార్చాలని రైతుల డిమాండ్

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని నుంచి కాల్వ శ్రీరాంపూర్ నుంచి పోత్కపల్లి వెళ్లే దారిలో కెనాల్ కాల్వ వద్ద 11 కే విద్యుత్ సరఫరా జరుగుతున్న విద్యుత్ స్తంభం దాదాపు ఆరు నెలల నుంచి రోడ్డు విస్తరణలో భాగంగా వంగి ఉంది.అటువైపు నిత్యం ప్రజలు ప్రజాప్రతినిధులు వెళుతూనే ఉంటున్నా కనీసం అటువైపు చూస్తున్న నాదుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు విస్తరణలో భాగంగా ప్రమాదకరంగా వంగిన విద్యుత్ పోల్ ను రోడ్డు కాంట్రాక్టర్ మారుస్తారా? లేక విద్యుత్ అధికారులు మారుస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.ఇప్పటికైనా సంబంధిత జిల్లా విద్యుత్ శాఖ అధికారులు,ఆర్ అండ్ బి రోడ్డు అధికారులు,రోడ్ కాంట్రాక్టర్ స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ పోల్ మార్చి విద్యుత్ ప్రమాదాన్ని నివారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాంట్రాక్టర్ స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ పోల్ మార్చి విద్యుత్ ప్రమాదాన్ని నివారించాలని రైతులు డిమాండ్ చేశారు.కాగా ఇట్టి సమస్య పట్ల రైతన్నల ఆవేదన వ్యక్తం చేయగా 'తెలంగాణ చౌరస్తా' లో వార్త కథనం ప్రచురించడం జరిగింది.




**ఎట్టకేలకు స్పందించిన విద్యుత్ అధికారులు...**

కెనాల్ కాలువ వద్ద విద్యుత్ సరఫరా జరుగుతున్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా వంగి రైతన్నలకు ఇబ్బంది కారణంగా మారడంతో 'తెలంగాణ చౌరస్తా' లో ప్రత్యేక కథనం ప్రచురణ కాగా,ఈ వార్త కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాన్ని మార్చారు. ఎట్టకేలకు విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభమును మార్చడం పట్ల కెనాల్ కు సంబంధించిన రైతన్నలు,ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# భక్తిశ్రద్ధలతో లంబోదరుని దర్శించిన బిఆర్ఎస్ నేతలు

- వినాయక మండపాల్లో బిఆర్ఎస్ నాయకుల సందడి
- ఘనంగా సన్మానించిన ఉత్సవ కమిటీలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు
- శ్రేణుల్లో నూతనోత్సాహం

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**

అశ్వారావుపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తిరుమలకుంట పంచాయతీ పరిధిలోని పలు గణేష్ మండపాలను బిఆర్ఎస్ పార్టీ కీలక నాయకులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలకుంట రాములవారి సన్నిధి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంతో పాటు రెడ్డిగూడెం, కోయగూడెం, తోగ్గుడెం, పాకాలగూడెం గ్రామాల్లోని వినాయక మండపాలను బిఆర్ఎస్ నాయకులు కాసాని నాగశేషా పద్మ, కౌన్సిలర్ డాక్టర్ ఉదయ జ్యోతి ప్రసాద్ రావు, గుడవర్తి వెంకటేశ్వరరావు, ఆరెపల్లి గోవిందు తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపాల వద్దకు చేరుకున్న నాయకులకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నాయకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, "గణపతి బప్పా మోరియా" అంటూ జయజయధ్వానాలు చేశారు. పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి దర్శనానంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులతో, స్థానిక గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు స్వయంగా విజిట్ చేసి ఉత్సవాల్లో పాల్గొనడంతో స్థానిక బిఆర్ఎస్ కార్యకర్తల్లో తీవ్ర ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ప్రజల భద్రతే లక్ష్యం

- నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు
- ఎలిగేడు ఎస్ఐ ఎల్. మధుకర్

**ఎలిగేడు,తెలంగాణ చౌరస్తా :**

ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎలిగేడు ఎస్ఐ ఎల్. మధుకర్ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎస్ఐ పేర్కొన్నారు. గురువారం ఎలిగేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక వ్యాపారులు, దుకాణదారులతో ఎస్ఐ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. పోలీసులం ప్రజల కోసమే పని చేస్తున్నామని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల వ్యాపారులకు, ప్రజలకు భద్రత పెరుగుతుందన్నారు. దుకాణదారులు ప్రతి ఒక్కరూ తమ షాపుల ఎదుట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చేందుకు పోలీస్ శాఖకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, నేరస్తులను గుర్తించి పట్టుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. గ్రామ భద్రత కోసం పోలీసులు చేపడుతున్న కార్యక్రమానికి వ్యాపారులు, దుకాణదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, దుకాణదారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొదుపు, పెట్టుబడులపై విస్తృత ఉపన్యాసం

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం బి.ఎ. విద్యార్థులకు పొదుపు,పెట్టుబడులు అనే అంశంపై విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సెబి సర్టిఫైడ్ ట్రైనర్ ముచ్చ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య వక్తగా హాజరై పొదుపు మార్గాలు, పెట్టుబడి విధానాలు, ఆర్థిక రిస్క్‌లను ఎదుర్కొనే జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ...జీవితంలో ఉన్నత స్థాయికి చేరడానికి సంపాదనతో పాటు సరైన పెట్టుబడి మార్గాలు ఎంచుకోవడం అవసరమని పేర్కొన్నారు. అధిక లాభాలకు ఆశపడకుండా చట్టబద్ధమైన పద్ధతులనే అనుసరించాలని,సైబర్ మోసాలు నకిలీ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అర్థశాస్త్ర విభాగాధిపతి వి.ఇందిర సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ మహబూబ్,డి.రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

# కమాన్‌పూర్‌లో ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన బీజేపీ శ్రేణులు
- తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలను కమాన్ పూర్ మండలంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షులు కొయ్యడ సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, ఒకరికొకరు స్వీట్లు పంపిణీ చేస్తూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో జాతీయ పతాకాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ ఎగురవేశారు. అమరుల త్యాగాలను స్మరిస్తూ జాతీయ జెండాకు వందనం చేశారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి జిల్లా



బీజేపీ ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము, సీనియర్ నాయకులు మట్ట శంకర్, మాజీ మండల అధ్యక్షుడు జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్ కుమార్, మండల జనరల్ సెక్రెటరీ పెద్దపెల్లి శ్యాంసుందర్, యువ నాయకులు పంతకాని విశ్వతేజ, సీనియర్ నాయకులు భూంపెల్లి మొండయ్య, మట్ట మల్లేష్, వడ్లకొండ తిరుపతి గౌడ్, పడాల కనకయ్య, జంగపల్లి సారయ్య, సంపత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.మండల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ రాపేల్లి రాముడు, పోలీస్ స్టేషన్లో గట్ల సుధాకర్,ఎంపీడీవో కార్యాలయంలో సురేందర్ కుమార్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి,సింగిల్ విండో కార్యాలయంలో చదువు రామచంద్రా రెడ్డి,మండల ఎంఆర్సి కార్యాలయంలో ఎంఈఓ సిరిమల్ల మహేష్,మండల క్రాంతి సమాఖ్య కార్యాలయంలో తాండ్ర మౌనిక,ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో డాక్టర్ శ్రీనివాస్, పాఠశాలల్లో ప్రధాన ఉపాధ్యాయులు,ఆయా గ్రామాలలో గ్రామ సర్పంచ్ లు జెండాను ఆవిష్కరించారు.






# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

- అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం
- మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి హయత్ నగర్ డివిజన్‌లోని గాంధీ విగ్రహం వద్ద బిజెపి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిజెపి డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, పార్టీ శ్రేణులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ..నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించేందుకు ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు.వారి ధైర్యసాహసాలు,పోరాట పటిమ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతీ ఒక్కరి కనీస బాధ్యత అని అన్నారు.తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తూ,మన నిజమైన చరిత్రను, వీరుల పోరాటాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సమగ్రతను, జాతీయ సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్,జిల్లా కార్యవర్గ సభ్యులు ఇట్టబోయిన నర్సింహా, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, సీనియర్ నాయకులు జాంజా నాయక్, జనార్ధన్, మొగులయ్య, అరుణ్, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎర్ర శ్రీనివాస్,భరత్, నాగరాజ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాటసింగారం పండ్ల మార్కెట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం తెలంగాణ సాయుధ పోరాట అమరులకు ఆయన నివాళులర్పించి వారి సేవలను స్మరించుకున్నారు.1948 సెప్టెంబర్ 17న రాచరిక పాలన అంతమై తెలంగాణలో ప్రజాస్వామ్య శకం ప్రారంభమైందని, అందుకే ఈ రోజును రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా వేడుకలు చేసుకోమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్.భాస్కరచారి, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్.శ్రీనివాస్,కమిటీ సభ్యులు మచ్చేందర్ రెడ్డి, నరసింహ,అంజయ్య, జైపాల్ రెడ్డి,బండి మధుసూదన్ రావు, గణేష్ నాయక్, రఘుపతి రెడ్డి,వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న సింగం

- అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్న ఎస్పీ రోహిత్ రాజ్, ఐపిఎస్..!
- వినాయక చవితి ఉత్సవాలకు కట్టుదిట్టమైన 'ఖాకీ' కవచం! డీఎస్పీ ఆదినారాయణ!
- ప్రజా రక్షణే ధ్యేయం.. ఆపదలో ఉంటే క్షణాల్లో ప్రత్యక్షం!
- వినాయక చవితి వేళ భద్రాద్రి జిల్లాలో సైరన్ మోత.. 'తెలంగాణ చౌరస్తా' కథనంతో వీధి వీధినా 'సింగం' మార్క్ గస్తీ!
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే తొక్కి పడేస్తాం..
- ఆపదలో ఉంటే క్షణాల్లో వాలిపోతాం ఖాకీ బాస్‌ల వార్నింగ్!
- 'తెలంగాణ చౌరస్తా' ప్రజావాణికి దక్కిన విజయం!

తెలంగాణ చౌరస్తా EFFECT


తెలంగాణ చౌరస్తా
12/09/2026 | Page No: 5
epaper.telanganachowrasta.com

భద్రాద్రి జిల్లాలో బెల్ట్ షాపుల విజృంభణ..

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా,**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పల్లెలు, పట్టణాలలో బెల్ట్ షాపుల విచ్చలవిడితనం, అక్రమ మద్యం, సాయంత్రం వేళల్లో కరువైన పెట్రోలింగ్, యువత చెడుదారిన పడుతున్న తీరుపై 'తెలంగాణ చౌరస్తా' ప్రచురించిన కథనం జిల్లా యంత్రాంగాన్ని పసికట్టి నిద్రలేపింది! 'తెలంగాణ చౌరస్తా' దెబ్బకు తక్షణమే స్పందించిన జిల్లా పోలీస్ బాస్ ఎస్పీ రోహిత్ రాజ్, డీఎస్పీ ఆదినారాయణ రౌడీమూకలు, అక్రమార్కుల ఆటలు కట్టించేందుకు 'సింగం' మార్క్‌తో నేరుగా రంగంలోకి దిగారు. 'తెలంగాణ చౌరస్తా' కథనం ఎఫెక్ట్‌తో జిల్లా వ్యాప్తంగా పెట్రోలింగ్ వాహనాలు సైరన్ మోగిస్తూ రోడ్లపైకి వస్తుంటే.. అక్రమార్కుల గుండెల్లో వణుకు మొదలైంది.

**వినాయక చవితి ఉత్సవాలకు కట్టుదిట్టమైన 'ఖాకీ' కవచం!**



పవిత్రమైన వినాయక చవితి ఉత్సవాల వేళ జిల్లాలో ఒక్క చిన్న అసంఘటిత సంఘటన జరిగినా, ఎక్కడైనా కొట్లాటలు, దొంగతనాలు, అల్లర్లు సృష్టించాలని చూసినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎస్పీ రోహిత్ రాజ్ హెచ్చరించారు. డీఎస్పీ ఆదినారాయణ నేరుగా క్షేత్రస్థాయిలోకి దిగి రూట్ మ్యాప్‌లను పర్యవేక్షిస్తున్నారు.మండలాల సరిహద్దుల నుంచి పల్లెల మూలమూలల వరకు రాత్రి, పగలు తేడా లేకుండా పోలీస్ వాహనాలు చక్ర బంధం వేయనున్నాయి. వినాయక మండపాల వద్ద మద్యం సేవించి గొడవలకు దిగినా, బెల్ట్ షాపులు నడిపినా, రోడ్లపై సీసాలు పగలగొట్టి రచ్చ చేసినా స్పాట్‌లోనే లాఠీ ఛార్జ్, క్రిమినల్ కేసులు తప్పవు!

**ప్రజా రక్షణే ధ్యేయం.. ఆపదలో ఉంటే క్షణాల్లో ప్రత్యక్షం!**

ప్రభుత్వం సమకూర్చిన ప్రతి పెట్రోలింగ్ వాహనం ప్రజా భద్రత కోసమే వీధుల్లో తిరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, అత్యవసర పరిస్థితిలో ఉన్న సామాన్యులు 'డయల్ 100', 112 కొడితే చాలు.. నిమిషాల వ్యవధిలోనే ఖాకీ వాహనం మీ ముందు నిలబడుతుంది. ప్రజలకు అభయం ఇవ్వడంలోనూ, నేరస్థుల సింహస్వప్నంగా నిలవడంలోనూ భద్రాద్రి పోలీస్ వ్యవస్థ సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది.

**'తెలంగాణ చౌరస్తా' ప్రజావాణికి దక్కిన విజయం**

ప్రజా సమస్యలపై 'తెలంగాణ చౌరస్తా' చూపిన చొరవకు, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టిన ఎస్పీ రోహిత్ రాజ్, డీఎస్పీ ఆదినారాయణల శైలిపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు వినాయక చవితి వేడుకలను అత్యంత ప్రశాంతంగా జరుపుకోవాలని, రక్షణగా 'సింగం' పోలీస్ వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని గంభీరంగా ప్రకటించారు.



## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే
- బీఆర్ఎస్ నాయకులు

**నూతనకల్, తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గిరిజనుల కోసం తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతగా నూతనకల్ మండలంలోని పలు గిరిజన తండాల్లో గురువారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సోమ్లాతండా, బక్కహేమ్లాతండా, టిక్యాతండా, కొత్తతండా, దిర్శనపల్లితండా, గుగులోతుతండా (మాచనపల్లి) గ్రామపంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. తండాలను, గూడాలను, ఆవాస ప్రాంతాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గిరిజన యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలకు మార్గం సుగమం చేసిందన్నారు. అదేవిధంగా 'మా తండాలో మా రాజ్యం' అనే గిరిజనుల చిరకాల ఆకాంక్షను సాకారం చేసే దిశగా తండాలు, గూడాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడం ద్వారా స్వయంపాలనకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ కిషోర్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నూతనకల్ మండల పార్టీ అధ్యక్షులు మున్నా మల్లయ్య యాదవ్, బత్తుల సాయిల్ గౌడ్, కనకటి వెంకన్న, నర్సింగ్ నాయక్, చుడి లింగారెడ్డి, గాద్దుల లింగరాజు, జటంగి కృష్ణ, చురుకంటి మధుసూదన్ రెడ్డి, బత్తుల విద్యాసాగర్, రేసు వెంకటేశ్వర్లు, బత్తుల విజయ్ కుమార్, ఉప్పుల వీరుయాదవ్, సర్పంచులు కోటేష్ నాయక్, గ్రామశాఖ అధ్యక్షులు వెంకన్న నాయక్, మూడు నెహ్రూనాయక్, కోటియా నాయక్, హనుమంతు నాయక్, గంగరాబోయిన వెంకన్న, నాగు నాయక్, వస్రం నాయక్, పాండు నాయక్, హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవులు అన్ని రంగాలలో ఆర్థికంగా ఎదగాలి

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన అల్లంల దేవేందర్ ను యాదవ సంఘం మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు తెలిపారు.ఈ సందర్భంగా అల్లంల దేవేందర్ మాట్లాడుతూ...మండలంలోని అన్ని గ్రామాలలో యాదవ సంఘం గ్రామ కమిటీలు వేసి,యాదవ్ సంఘాన్ని ముందుకు నడిపిస్తానని,యాదవ సంఘం అభివృద్ధికి తోడ్పడుతానన్నారు.యాదవ సోదరులు ఆర్థికంగా సామాజికంగా బలపడాలని కోరారు.యాదవులందరూ ఒకటై రాజకీయ శక్తిగా ఏర్పడాలన్నారు.



## జాతీయ జెండా ఆవిష్కరణ

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**

రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కాసిపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి,ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య,కో ఆపరేటివ్ చైర్మన్ శంకర్ గౌడ్,ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ,సూపరింటెండెంట్ ఏ.లక్ష్మయ్య,సీనియర్ సహాయకులు ఏ.లక్ష్మీనారాయణ,రాజమణి, జేఏ కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మనోవికాస కేంద్రంలో సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు

- వారి జిఎస్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- కేక్ కట్,పండ్లను పంపిణీ చేసిన గూడూరు సతీష్ కుమార్

**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:**

శ్రీమల్లికాంబ మనోవికాస కేంద్రంలో వైభవంగా జిల్లా కాంగ్రెస్ నేత గూడూరు సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు ప్రత్యేక అవసరాలు గల పిల్లల మధ్య కేక్ కట్ చేసి,దుస్తులుపండ్ల పంపిణీ గూడూరు సతీష్ ఫౌండేషన్ (జిఎస్ఎఫ్) ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.హనుమకొండలోని శ్రీమల్లికాంబ మనోవికాస కేంద్రంలో అత్యంత వేడుకగా,అర్థవంతంగా జరిగాయి.తన పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం ఆయన మనోవికాస కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల మధ్య కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు నూతన దుస్తులు,పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గూడూరు సతీష్ కుమార్ మాట్లాడుతూ...అమాయకత్వం, స్వచ్ఛమైన మనసు కలిగిన ఈ పిల్లల మధ్య తన జన్మదిన వేడుకలు



జరుపుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని,ఈ రోజు తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని తీపి జ్ఞాపకంగా నిలిచిపోతుందని భావోద్వేగానికి గురయ్యారు.భవిష్యత్తులో కూడా తాను స్థాపించిన గూడూరు సతీష్ ఫౌండేషన్ ( జిఎస్ఎఫ్) ద్వారా సమాజంలో నిరుపేదలకు,అవసరంలో ఉన్న వారికి అనేక సేవా కార్యక్రమాలు అందించి ప్రజల మన్ననలు పొందుతానని స్పష్టం చేశారు .ఈ వేడుకల్లో శ్రీమల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది,ఉపాధ్యాయులు,పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని గూడూరు సతీష్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- మండల ప్రత్యేక అధి కారి రాజేశ్వరి

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**

కాసిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి నిరటి రాజేశ్వరి ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మండల పరిధిలోని సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు,అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ ఐక్య సంఘం భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, సర్పంచులకు సూచించారు.పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.భూగర్భ జలాల పెంపునకు చేపట్టాల్సిన నీటి సంరక్షణ పనుల పురోగతిని సమీక్షించారు.వర్షపు నీటిని నిల్వ చేసేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.వికసిత్ భారత్ గ్రామీణ పథకం కింద గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన,మెటీరియల్ కాంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

**పారిశుధ్యం,నిధుల వినియోగంపై సూచనలు**

ఎస్ డబ్ల్యూఎం రూల్స్2026నిబంధనల ప్రకారం గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు.స్వచ్ఛ భారత్ మిషన్ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.16వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో అవసరమైన పనులకు మాత్రమే వినియోగించాలని,గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులను, పెంచుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు**

గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణకు ఏబిసి సెంటర్ల ద్వారా చర్యలు చేపట్టాలని, కోతుల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.మండలంలోని అన్ని వీధి దీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు.ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు.

**సంక్షేమ పథకాల వివరాలు**

సమావేశంలో సంక్షేమ పథకాల అమలుపై కూడా వివరాలు వెల్లడించారు.చేయూత పెన్షన్‌కు సంబంధించి మొత్తం 596 మంది లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.ఇందులో వితంతువులు 344 మంది, సింగిల్ ఉమెన్ 79 మంది, వికలాంగులు 166 మంది, చేనేత కార్మికులు ఒకరు, కాళ్ల గీత కార్మికులు ఆరుగురు ఉన్నట్లు పేర్కొన్నారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 28 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.20,000 చొప్పున మొత్తం రూ.5,60,000 వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏఎంసీ చైర్మన్ రత్నం సుకుమారి,ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య,సింగిల్ విండో చైర్మన్ శంకర్ గౌడ్,ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్,ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, మెడికల్ ఆఫీసర్ శ్రీ విద్య, ఎంఈఓ వెంకటేశ్వర స్వామి, ఎన్.వినయ్,జగన్,చల్ల ప్రభాకర్, అశోక్,అంజయ్య,కవిత,రాధిక, నవీన్ కుమార్,వివిధ శాఖల అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,మండలంలోని సర్పంచులు పాల్గొన్నారు.




## పండ్ల మార్కెట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరణ

- చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్క రించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట అమరులకు ఆయన నివాళులర్పించి వారి సేవలను స్మరించుకున్నారు.1948 సెప్టెంబర్ 17న రాచరిక పాలన అంతమై తెలంగాణలో ప్రజాస్వామ్య శకం ప్రారంభమైందని, అందుకే ఈ రోజును రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా వేడుకలు చేసుకోమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్.భాస్కర చారి, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్.శ్రీనివాస్,కమిటీ సభ్యులు మచ్చేందర్ రెడ్డి, నరసింహ, అంజయ్య, జైపాల్ రెడ్డి,బండి మధుసూదన్ రావు, గణేష్ నాయక్,రఘుపతి రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీంతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.